# లక్షాధికారి

(కథానిక)

ధనవంతుడై ఉంటేగాని, అందగాడవడంలో లాభం ఏమీ లేదు. ప్రేమవ్యవహారాలు ధనవంతులకి సదుపాయంగాని నిరుద్యోగులకి ఉద్యోగం కావు. బీదవాళ్లు తమ పనులు చూసుకుంటూ మాత్రం ఉండాలి. చాలా ఆకర్షణీయుడిగా ఉండడంకన్న శాశ్వతమైన ఆదాయాన్ని పొంది ఉండడం చాలా మంచిది. ఆధునిక జీవితంలో మిక్కిలి గొప్పవీ, హాగీ ఎర్స్కిన్ గుర్తించనివీ ఈ పరమసత్యాలు. పాపం, హాగీ! తెలివితేటలకి సంబంధించినంతదాకా హాగీకి పెద్ద ప్రాముఖ్యం ఏమీ లేదు. అత నెప్పుడూ చాలా తెలివైనది కాని, పోనీ చెడ్డది కాని ఒకమాట జీవితంలో యెప్పుడూ ఆడలేదు. కాని చక్కని ఉంగరాల జుత్తుతోనూ, అందమైన ముఖంతోనూ, అతను యెంతో అద్భుతమైన మనిషి. స్త్రీలకీ పురుషులకీ అతను సమానంగా అభిమానపాత్రుడిగా ఉండేవాడు. నిజంగా ధనసంపాదన తప్ప మిగిలిన లక్షణాలన్నీ అతనికి ఉండేవి. డబ్బు సంపాదించడానికి అతనన్ని విధాలా ప్రయత్నించాడు. ఆరు నెలలు స్పెక్యులేషన్‌లో ప్రయత్నించాడు. కాని, సీతాకోకచిలుక స్పెక్యులేషన్‌లో ఏమిటి చెయ్యగలదు? ఎన్ని వ్యాపారాలు పెట్టినా ఏమీ లాభం లేకపోయింది.

సరే. ఈ పరిస్థితులని ఇంకా పాడుచెయ్యడానికి అతను ప్రేమలో కూడా పడ్డాడు. అతను ప్రేమించిన అమ్మాయి లారా మెర్టన్-ఇండియాలో జీర్ణశక్తినీ, స్వాభావికత్వాన్నీ పోగొట్టుకున్న ఒక కలెనల్ గారి అమ్మాయి. ఆ కలెనల్ కిపోయిన ఆ రెండూ మరెప్పుడూ దొరకలేదు. లారాకి హాగీ అంటే చాలా ప్రేమ. అత నామె జోడు తాళ్ళని ముద్దు పెట్టుకోడానికి సిద్ధంగా ఉండేవాడు. ఇద్దరి మధ్యా ఒక్క పెన్నీ కూడా లేదు కాని వాళ్లు లండన్ అంతకీ మిక్కిలి అందమైన జత. కలెనల్‌కి హాగీ అంటే ఇష్టమే కాని, పెళ్ళి మాట అతను వినిపించుకోడు.

"నీదగ్గర పదివేల పౌండ్లు ఉన్నప్పుడు రావోయ్ అప్పుడు ఆ మాట ఆలోచిద్దాం" అనేవాడతను. హాగీ పాపం లారా దగ్గరకి ఓదార్పుకోసం వెళ్ళేవాడు.

ఒక రోజు ఉదయం లారా ఇంటికి వెళ్తూ తన స్నేహితుడు అలాన్ ట్రెవర్‌ని చూడడానికి వెళ్ళాడు. ట్రెవర్ చిత్రకారుడు ఆ మాట కొస్తే ఈ రోజుల్లో ఆ మాత్రం చిత్రకారుడు కానివాడెవడు? కాని ట్రెవర్ మంచి కళావేత్త కూడాను. కళావేత్తలు మాత్రం తరుచు కనిపించరు. దురుసు గెడ్డంతోనూ, మోటు ముఖంతోనూ ట్రెవర్ చాలా మోటుగా కనిపించేవాడు. కాని బ్రెష్ పట్టుకుంటే అతను నిజమైన శాస్త్రజ్ఞుడు! అతని చిత్రాల కోసం చాలామంది యెగబడేవారు. హాగీ వ్యక్తిత్వంలోని సౌందర్యంచేత అతను చాలా ఆకర్షింపబడ్డాడు. చూడడానికి అందమైనవాళ్ళూ తెలివైన వాళ్ళూ మాత్రమే మాటలాడడానికి పనికొస్తారని అతననేవాడు. హాగీతో అతని పరిచయం అయ్యేక త్వరలో వాళ్లు చాలా ఆప్తమిత్రులయిపోయారు. ఎప్పుడైనా సరే, హాగీ అతని స్టూడియోకి వెళ్ళగలిగేవాడు

హాగీ లోనికి వెళ్ళేసరికి ట్రెవర్ ఒక ముష్టివాడి చిత్రానికి చివరి అలంకారాలు చేస్తున్నాడు. స్టూడియోలో ఓ చివర ఆ ముష్టివాడు ఒక బెంచీదగ్గర నిలుచుబడ్డాడు. ఆ ముష్టివాడు ముడతలుపడ్డ ముఖంతో, జాలి కలిగించే ముఖభావనతో చాలా జాలి గొలుపుతున్నాడు. వాడి భుజంమీద నల్లటి క్లోక్ ఒకటి ఉంది. అది పూర్తిగా చిరిగిన చింకిపాత. వాడి బూట్లు కూడా పూర్తిగా అతుకులతో వికారంగా ఉన్నాయి. ఒక చేత్తో ఒక మోటు కర్రని పట్టుకుని రెండో చేత్తో ఆ ముష్టివాడు నలిగిన

మూలం ఆస్కార్ వైల్డ్ — అనువాదం "ప్రభు"

ఒక టోపీని ముష్టికోసం పట్టుకున్నాడు.

"ఎంత చక్కని మోడల్!" అన్నాడు హాగీ, ట్రెవర్‌తో కరచాలనం చేస్తూ లోనికి వెళ్ళగానే.

"చక్కటి మోడల్!" గట్టిగా అన్నాడు ట్రెవర్. "అంతేన్లే. వాడిలాంటి ముష్టివాళ్ళు తరుచు దొరకరు. దొరికాడుతే అలాగ. రాంబ్రాంట్ వాణ్ణి చూస్తే ఎంత గొప్ప 'ఎచ్చింగ్' తయారు చేస్తాడంటావు? నా అదృష్టం!"

"పాపం! యెంత దీనంగా ఉన్నాడోయ్! కాని, మీ చిత్రకారులకి ఆ దీనత్వమే పెన్నిధి అనుకుంటాను!"

"ఔను. ముష్టివాడు సుఖంగా కనపడాలని అనవు కదూ?" అన్నాడు ట్రెవర్ చిన్న చిరునవ్వుతో.

"మోడల్ నిల్చున్నందుకు ఎంత ఇస్తారు?" అన్నాడు హాగీ, ఒక సుఖవంతమైన కుర్చీలో కూర్చుంటూ.

"గంటకొక షిల్లింగ్."

"మరి, ఈ చిత్రానికెంత వస్తుందోయ్?"

"దీనికి రెండు వేలు వస్తాయి."

"పౌండ్లే?"

"కాదోయ్...గినియాలు. చిత్రకారులూ, కవులూ, వైద్యులూ గినియాలలో ఆర్జిస్తారు."

"మోడల్‌కి కూడా మీ లాభాలలో వంతు ఇవ్వాలోయ్! మీతో సమానంగా శ్రమపడుతున్నాడు కదూ?"

"ఛీ... ఈ రంగు వెయ్యడానికే చూడు ఎంత బాధపడాలో — అదీ కాక రోజంతా ఈజిర్ దగ్గర నిలబడాలి. కబుర్లయితే చెప్పొచ్చు కాని, ఒక్కొక్కప్పుడు చిత్రరచనకి కూడా కాయకష్టం అవసరమోయ్. సరే కాని, ఇంక మాట్లాడకు– పని చెయ్యాలి. సిగరెట్ కాల్చుకుంటూ కూర్చో."

కొంచెం సేపయ్యాక బంట్రోతు వచ్చి ట్రెవర్ కోసం ఎవ్వరో వచ్చారని చెప్పాడు. "వెళ్ళిపోకోయ్ హాగీ...క్షణంలో వస్తాను" అని చెప్పి ట్రెవర్ బైటికి వెళ్ళాడు.

ట్రెవర్ లేని అసరా చూసుకుని ఆ ముసలి భిక్షుకుడు తన వెనకాల ఉన్న బెంచీమీద కూర్చున్నాడు. వాడి దీనత్వం హాగీ హృదయాన్ని కలచివేసింది. జేబులో తడుముకుంటే ఒక సోవరిన్, కొంచెం చిల్లర ఉంది. "పాపం. ముసిలాడు! నాకంటే వీడికి చాలా అవసరం ఈ డబ్బు అవసరం— అయినా ఇది నాకొక రెండువారాల పైఖర్చు!" అనుకున్నాడు హాగీ. నెమ్మదిగా ముష్టివాడి దగ్గరికి వెళ్ళి ఆ సోవరిన్ నాణెం వాడి చేతులో ఉంచాడు.

వృద్ధుడు కదిలాడు. ఎండిపోయిన వాడి పెదవులమీద చిరునవ్వు మెరిసింది... "మంచిది బాబూ... మంచిది" అన్నాడు.

ఇంతటిలో ట్రెవర్ వచ్చాడు. తను చేసిన పని మరిచిపో ప్రయత్నిస్తూ హాగీ అతని సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు. ఆరోజు లారాతో గడిపి, తన ఖర్చుకి తియ్యటి చీవాట్లు తిని ఇంటికి నడిచి వెళ్ళాడు.

ఆ రాత్రి ట్రెవర్ క్లబ్బులో సిగరెట్ కాల్చుకుంటూ కూర్చుండగా హాగీ వెళ్ళాడక్కడికి.

సిగరెట్ వెలిగించుతూ, "ఏమోయ్! చిత్రం పూర్తి చేశావా?" అన్నాడు

"అయిపోయింది. ఫ్రేమ్ కూడా అయిపోయింది" అన్నాడు ట్రెవర్. "కాని, నువ్వు గొప్ప జయం పొందేవే! ఆ ముసిలి మోడల్‌కు నువ్వంటే చాలా అభిమానం. నీగురించి అంతా చెప్పవలసివచ్చింది."

"అలాన్! ఇంటికెళ్ళేసరికి నాకోసం చూస్తూ ఉంటాడనుకుంటాను బహుశా – నువ్వు హాస్యం ఆడుతున్నావా? పాపం, చాలా బీదవాడు! ఏమైనా సహాయం చెయ్యాలని ఉంది. అంత దీనత్వం కష్టం కాదుటోయ్? ఇంటిదగ్గర చాల పాత బట్టలున్నాయి. అవి తీసుకెంటాడనుకుంటాను. వాడిబట్టలన్నీ పీలికలైఉన్నాయి."

"ఆ పీలికల్లో వాడు అద్భుతంగా ఉన్నాడు. కోటు వేసుకుంటే లక్ష రూపాయిలిచ్చినా వాడి చిత్రం గియ్యను. ఆ పీలికలే అందమంతానంటాను. నీకేదైతే బీదరికమో అదే నాకు సౌందర్యం... అయినా వాడితో నీదానం గురించి చెప్తాన్లే."

"అలాన్! కళాకారులు కఠోర హృదయులు సుమా!" అన్నాడు హాగీ.

"వీటికేంలే కాని లారా ఎలా ఉంది? మోడల్‌కి ఆమె అంటే చాలా కౌతుకంగా ఉంది."

"ఆమె గురించి చెప్పావంటూ వేంటి కొంప తీసి?"

"నిజంగా చెప్పాను. హృదయంలేని ఆ కలెనల్ గురించీ, నీ చక్కటి లారా గురించీ, పది వేల పౌండ్లు గురించీ కూడా—"

చాలా కోపంగా చూస్తూ హాగీ, "నా వ్యక్తిగత విషయాలన్నీ ఆ ముష్టివాడితో చెప్పావు!" అన్నాడు.

చిరునవ్వుతో, ట్రెవర్ "అబ్బాయ్! ఆ ముసలిభిక్షుకుడంటున్నావే, అతను యూరప్‌లో పెద్ద ధనవంతుల్లో ఒకడు. రేపు తల్చుకుంటే అతను లండన్ నంతటినీ కొనేయగలడు. రష్యా యుద్ధానికి పోకుండా ఆపగలడు" అన్నాడు

"నీ ఉద్దేశమేమిటి?" అన్నాడు హాగీ మహాశ్చర్యంతో.

"నా ఉద్దేశం ఏమిటంటే, ఇవేళ నువ్వు చూసిన వృద్ధుడి పేరు హౌస్‌బర్గ్. నాకు చాలా ప్రియమిత్రుడు. నా చిత్రాలన్నిటినీ కొంటూ ఉంటాడు. ఒక నెల క్రిందట భిక్షుకుడి చిత్రం వేసి పెట్టమన్నాడు. కోటీశ్వరుడి పిచ్చి చూశావా? ఆ చింకిగుడ్డల్లో అంటే—అవి నావేలే. స్పెయిన్‌లో కుట్టించిన ఒక పాత సూటు అది—అతను అద్భుతంగా ఉన్నాడు కదూ?"

"బేరన్ హౌస్‌బర్గా? దేవుడా అతనికి నేనో సావరిన్ ధర్మం చేశానోయ్. సావరిన్!" హాగీ దీనంగా కుర్చీలో కూలబడిపోయ్యాడు

"అతనికి సావరిన్ ఇచ్చావా?" అని కేక వేసి, ట్రెవర్ నవ్వుతూ "ఇక అది తిరిగి రాదులే" అన్నాడు.

"అలాన్! నువ్వు నాకు చెప్పి ఉండవలసింది. వట్టి మూర్ఖుడినై పోకుండా ఉందును" అన్నాడు హాగీ బాధగా.

"సరే. నీవు చెప్పాలంటే, ఒకటో విషయం అంత నిర్లక్ష్యంగా దానధర్మాలు చేస్తున్నావని నాకు తెలీదు. అందమైన అమ్మాయిలు మోడల్‌గా కూర్చుంటే ముద్దుపెట్టుకోవచ్చు కాని, ఒకరూపి ముష్టివాడు మోడల్‌గా ఉంటే ధర్మం చెయ్యడం ఛీ! అదీకాక, హౌస్‌బర్గ్ తను డ్రెస్‌లో లేకుండా తన పేరు బయట పెట్టడం ఇష్టపడతాడని అనుకోలేదు."

"వట్టి తెలివితక్కువ పెద్దమ్మని అనుకుని ఉంటాడు!"

"అది ఏమీ లేదు. నువ్వెళ్ళిపోయాక అతను చాలా సరదాగా ఉన్నాడు. నిన్ను గురించి అంత అనురక్తితో యెందుకు అడుగుతున్నాడో తెలుసుకోలేకపోయాను. ఇప్పుడంతా తెలుస్తోంది. అతను నా సావరిన్ పెట్టుబడి పెట్టి ప్రతీ ఆరుమాసాలకీ నీకు వడ్డీ ఇచ్చేస్తూంటాడు. ఈ కథ స్నేహితులతో చెప్పుకుంటూంటాడు!"

"నేను వట్టి దురదృష్టవంతుణ్ణి. ఇక పోయి పడుకోవడంకన్న ఉత్తమమైన పని లేదు. జరిగినదెవరితోనూ చెప్పకు. ముఖం ఎత్తి తిరగడానికీ వీలుండదు."

"మతి లేకపోతే సరి! నీ దయాబుద్ధి నే గుర్తిస్తారు లోకులీకథనం విని ... పరిగెట్టకు ... ఇదిగో. సిగరెట్ వెలిగించి నీలారా గురించి చెప్పు."

కాని హాగీ ఆగలేదు. నవ్వుతూన్న ట్రెవర్‌ని వదిలిపెట్టి, బాధగా ఇంటికి వెళ్ళిపోయాడు.

మర్నాడుదయం హాగీ కాఫీ తాగుతూంటే బంట్రోతు ఒక విజిటింగ్ కార్డు తెచ్చి ఇచ్చాడు. "గస్టావ్ నాదన్ - బేరన్ హౌస్‌బర్గ్ తరఫున" అని ఉంది దానిమీద.

"క్షమాపణకోసం వచ్చి ఉంటాడు" అని తనలో అనుకుని, ఆగంతకుడిని పంపమన్నాడు హాగీ.

బంగారు కళ్ళజోడుతో ఒక వృద్ధుడు లోనికి వస్తూ "తమరు ఎర్క్సిన్ హాగీగారా?" అని ప్రశ్నించాడు.

హాగీ గౌరవంగా తల వంచాడు.

"బేరన్ హౌస్‌బర్గ్ పంపారునన్ను. ఆయన—"

"నా హృదయపూర్వకమైన క్షమాపణ చెప్పండాయనకి" అన్నాడు తడబడుతూ హాగీ.

ఆగంతకుడు చిరునవ్వుతో, "ఆయన తమకీ ఉత్తరం ఇమ్మన్నారు" అంటూ సీలువేసిన ఒక కవర్ ఇచ్చాడు.

ఆ కవర్ మీద—"వృద్ధభిక్షుకుడినించి మిస్టర్ హాగీ ఎర్క్సిన్‌కి బహుమానం" అని వ్రాసి ఉంది.

లోపల పదివేల పౌండ్లకి చెక్ ఉంది.